సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 12 । ఆగస్టు । 2024



మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్ డ్రా

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం డ్రాగా ముగిశాయి.

-8లో



గోలీ గుడ్లు

పోషకాహారం పేరుతో గోలీ సైజులో ఉన్న గుడ్లు సరఫరా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.320
రెండోరకం	రూ.200	రూ.266



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 396 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	410	470
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 328.980 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జాతీయ అవార్డుకు ఎంపిక



జయలక్ష్మి

మదనపల్లె సిటీ: అంగన్‌వాడీ కేంద్రంలో అత్యుత్తమ సేవలు అందించినందుకు కేంద్ర ప్రభుత్వం అందజేసే పోషన్ అభియాన్ అవార్డుకు మదనపల్లె పట్టణం ఇందిరానగర్–1 అంగన్‌వాడీకేంద్రం టీచర్ టి.జయలక్ష్మి ఎంపికయ్యారు.ఈ మేరకు జిల్లా ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ఆమెకు సమాచారం వచ్చింది. ఈనెల 15న ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అయిదు మందిని ఎంపిక చేయగా అందులో జిల్లా నుంచి మదనపల్లె ఐసీడీసీ ప్రాజెక్టుకు అవార్డు దక్కింది. అంగన్‌వాడీ కేంద్రంలో వందశాతం ప్రీస్కూల్ పిల్లలను చేర్పించడం, ప్రీస్కూల్ నిర్వహణ, గృహాల సందర్శన, టీహెచ్‌ఆర్ వందశాతం పూర్తి చేయడంతో పాటు పలు అంశాలపై ఆమెను ఎంపిక చేశారు. ఆదివారం ఆమె ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఐసిడిఎస్ పీడీ, ఐసిడిఎస్ పిఓ సుజాత, సూపర్‌వైజర్ల సహకారంతో అవార్డుకు ఎంపికైనట్లు జయలక్ష్మి తెలిపారు.

బీఆర్క్ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల



ఏఎఫ్‌యూ: బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో (బీఆర్క్) 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసినట్లు బీఆర్క్–2024 ప్రవేశాల ఏపీ కన్వీనర్, డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఇంటర్మీడియట్ లేదా డిప్లొమా పూర్తి చేసి నాటా (నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్)లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 19లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్లు, ఫీజుల చెల్లింపు ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలో 44 సీట్లు, గుంటూరు ఏఎన్‌యూలో 44 సీట్లు, భీమవరం ఎం.ఆర్.కె. కళాశాలలో 15 సీట్లు, తిరుపతి చదలవాడ అరుణ కళాశాలలో 28 సీట్లు, కడప వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో 44 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

చేనేతల ఖ్యాతి దేశమంతా చాటుదాం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ అదితిసింగ్

కడప కల్చరల్: మన జిల్లాకు వరంగా నిలిచిన మాధవరం చేనేతల ఖ్యాతిని దేశమంతటా చాటేందుకు కృషి చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక శిల్పారామంలో జిల్లా హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ జి.నాగరాజారావు ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సంర్భంగా జేసీ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించడమే చేనేత కళాకారులను ఆదుకోవడమేనని, మన జిల్లా ప్రత్యేకతను చాటే వారసత్వ సంపద అయిన చేనేతలను కాపాడుకుందామని సూచించారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ చేనేత వస్త్రాల ప్రాధాన్యతను వివరించారు. వ్యక్తిగతంగా తానుచేనేత వస్త్రాలను ఇష్టపడతానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తోపాటు శిల్పారామం పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి, పర్యవేక్షకులు పి.మధుసూదన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది, ఆప్కో సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకులతో ఆటలు


ప్రభుత్వ జూనియర్ కాలేజీల కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కులా ఉంది. ఏటా కళాశాలలు ప్రారంభించే నాటికే కాంట్రాక్టు లెక్చరర్లను రెన్యువల్ చేస్తూ ఉత్తర్వులు వచ్చేవి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉత్తర్వులు జారీ కాకపోవడంతో లెక్చరర్లలో ఆందోళన నెలకొంది.

- రెన్యువల్ లేదు...జీతాలు రాలేదు
- ఆందోళనలో జూనియర్ కాలేజీ కాంట్రాక్టు లెక్చరర్లు



మదనపల్లెలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ

మదనపల్లె సిటీ: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేసే కాంట్రాక్టు లెక్చరర్లు మూడు నెలలుగా జీతాలు లేక, రెన్యువల్‌కూ నోచుకోక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31618 మంది, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 562 మంది కాంట్రాక్టు లెక్చరర్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్నారు. ఏప్రిల్ 30తో వారి కాంట్రాక్టు ముగిసినా వారి సేవలు మాత్రం వేసవిలో సైతం నిరంతరాయంగా కొనసాగించారు.గత ప్రభుత్వంలో 12 నెలలకు జీతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మే, జూన్, జులై నెలలకు సంబంధించి జీతాలు విడుదల కావాల్సి ఉంది. నాలుగో నెల గడుస్తున్నా ఇంకా రెన్యువల్ ఉత్తర్వులు విడుదల కాకపోవడంతో అధ్యాపకుల కుటుంబాలు ఆకలి కేకలతో విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2000 సంవత్సరంలో మొదలు పెట్టిన వ్యవస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ వ్యవస్థ నియామకాల ప్రక్రియ 2012తో ముగిసింది.



రెన్యువల్ విధానంలో కొనసాగుతున్న వ్యవస్థలో ఉద్యమ పోరాటాలు సాగించి వేతన పెంపు, సెలవుల వర్తింపు, ఏడాదిలో 12 నెలల కాలానికి సర్వీస్ వంటివి సాధించినా ఇప్పటికీ వెట్టి చాకిరీ తప్ప, తగిన ఉద్యోగ భద్రత లేక అలమటిస్తున్నారు. దీంతో పాటు పార్ట్‌టైమ్, ఎంటీఎస్ కింద పని చేసే లెక్చరర్లకు రెన్యువల్ ప్రక్రియ జరగలేదు.

రెగ్యులరైజేషన్ ఏమైనట్లు?

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజేషన్ చేయాలని వై.ఎస్. జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు ప్రతి చోట కాంట్రాక్టు లెక్చరర్లు తమ సమస్యలను విన్నవించారు. క్రమబద్ధీకరించాలని అభ్యర్థించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి అధ్యయనం చేయించి రెగ్యులరైజేషన్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న 10,117 మందిని గుర్తించి వారిలో 2014 జూన్2 నాటికి అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని క్రమబద్ధీకరించాలని తొలుత నిర్ణయం తీసుకున్నారు. మళ్లీ కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి వచ్చిన విన్నపాల మేరకు 2014 జూన్ 2 నాటికి సర్వీసులో ఉన్న వారందరిని రెగ్యులర్ చేయనున్నట్లు ప్రకటించారు. ఏపీ చట్టసభలో నూతనంగా 30 యాక్టు రూపొందించి ఆమోదించి దానికి అనుగుణంగా జీవో నంబర్ 114ను జారీ చేశారు. అయితే వివిధ కారణాలతో జాప్యం జరిగి ఎన్నికల కోడ్ ముంగిట రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. గత ప్రభుత్వం ప్రకటించిన 10,117 పోస్టుల్లో పని చేస్తున్న వారందిరినీ రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్లు కోరుతున్నారు.

కుంటిసాకులతో కాలయాపన



మే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, అడ్మిషన్ క్యాంపెయిన్ విధులు, ఎన్నికల డ్యూటీలు, పరీక్షల విధులు, మూల్యాంకనం విధుల్లో అధికారులు కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసులను ఉపయోగించుకున్నారు.గతంలో ఎన్నికల స్టంట్ మాదిరిగా చంద్రబాబు ప్రభుత్వం దిగేటప్పుడు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం వారి సర్వీసు కమిటీ 10 రోజుల బ్రేక్‌తో 12 నెలల కాలానికి కాంట్రాక్టు లెక్చరర్ల సేవలు ఉంచాలని నవంబర్ 2018న నిర్ణయించింది. అయితే తక్షణం అమలు చేయకుండా 2019 ఏప్రిల్ అమలులోకి వచ్చేలా ప్రభుత్వంపై వేసి చేతులు దులుపుకున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 12 నెలల కాలానికి జీతాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంది. అయితే మళ్లీ వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కుంటి సాకులతో మే నెల జీతానికి ఎసరు పెట్టే దిశగా చూస్తోందని కాంట్రాక్టు లెక్చరర్లు ఆరోపిస్తున్నారు. పాలనాపరంగా.. సాధారణంగా జరగాల్సిన రెన్యువల్ ప్రకియలో జాప్యం చేస్తున్నారు.

త్వరలో సమస్య పరిష్కారం

రెన్యువల్ ఉత్తర్వులు త్వరలో రానున్నట్లు సమాచారం అందింది. దీంతో నిలిచిపోయిన జీతాలు రానున్నాయి. రెగ్యులరైజేషన్ ప్రక్రియను చేపట్టి అడ్డంకులు లేకుండా కాంట్రాక్టు లెక్చరర్లు అందరినీ పర్మినెంట్ చేయాలి.

–రెడ్డప్పరెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ చైర్మన్

వెలిగల్లు రిజర్వాయర్ నుంచి నీరు విడుదల



వెలిగల్లు రిజర్వాయర్‌లోని కుడి కాల్వలో ప్రవహిస్తున్న నీరు

గాలివీడు: వైఎస్‌ఆర్ వెలిగల్లు రిజర్వాయర్ నుంచి 66 క్యూసెక్కుల నీటిని కుడి కాల్వ ద్వారా విడుదల చేసినట్లు ప్రాజెక్టు డీఈ సురేష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 4.64 టీఎంసీల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లో 2.77 టీఎంసీల నీరు నిల్వ ఉంది.2 టీఎంసీలు నిల్వ ఉంచి మిగిలిన నీటిని రైతుల పంట పొలాలకు మూడు నెలల పాటు వదులుతున్నట్లు చెప్పారు. 2 టీఎంసీలను రిజర్వాయర్ లో తాగునీటి కోసం నిల్వ ఉంచామన్నారు.ప్రాజెక్టు నుంచి 27 కిలోమీటరు వద్ద నీరు ప్రవహిస్తోంది. చెరువుల వద్ద ఎవరైనా రంధ్రాలు ఏర్పాటు చేసి నీటిని దుర్వినియోగం చేస్తే పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గండికోటకు కృష్ణా జలాలు

కొండాపురం: అవుకు రిజర్వాయర్ వద్ద నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కాలువ ద్వారా 11 వేల క్యూసెక్కుల నీరు గండికోట జలాశయంలోకి ఆదివారం ఉదయం చేరినట్లు జీఎన్‌ఎస్‌ఎస్ డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగు తాగు నీటి అవసరాల కోసం 45 టీఎంసీలు గండికోట జలాశయం ద్వారా ప్రాజెక్టులలో నిలువ చేస్తామన్నారు. గండికోట ప్రాజెక్టులో 25 టీఎంసీలు నిల్వచేసి ఈ ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయం వామికొండ రిజర్వాయర్లు సర్వరాయ సాగర్, పైడిపాలెం జలాశయం చిత్రావతి బ్యాలెన్స్ రిజర్వాయర్‌లోనూ కృష్ణా జలాలు నిలువ చేస్తామన్నారు.

గంగమ్మా..కాపాడవమ్మా..



ప్రత్యేక అలంకరణలో అనంతపురం గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె: గంగమ్మ తల్లీ.. కరుణించి కాపాడవమ్మా అంటూ భక్తులు అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అనంతపురం గంగమ్మను వేడుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు మొక్కులు ఉన్న వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు.తలనీలాలు అర్పించారు.ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం



టీడీపీ నాయకులు దున్నిన పొలం

పెండ్లిమర్రి: టీడీపీ నాయకుల దౌర్జన్యాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. పెండ్లిమర్రి మండలం వెల్లటూరు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 202లో 4.66 ఎకరాల పట్టా భూమి ఉంది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు కె.జనార్దన్‌రెడ్డి, రామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డికి కలిపి 1.25 సెంట్ల భూమి ఉంది. టీడీపీ నాయకులు పి.భాస్కర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, శ్రీనివాసులురెడ్డిలు ఓ ప్రైవేట్ సర్వేయర్‌తో కొలతలు వేయించి తమ భూమిని దౌర్జన్యంగా దున్నేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. భూమి మాది అని అడిగితే మమ్మలను భయబ్రాంత్రులకు గురి చేస్తున్నారని జనార్దన్‌రెడ్డి, రామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కమనీయం..రామయ్య పట్టాభిషేకం



పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



గరుడ వాహనంపై ఊరేగుతున్న పట్టాభిరాముడు

గరుడ వాహనంపై వైభవంగా నగరోత్సవం

వాల్మీకిపురం: టీటీడీ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం శ్రీ పట్టాభి రామాలయంలో ఆదివారం శ్రీరాముడికి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అర్చన, అభిషేకం, తోమాలసేవ.. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. సీతారాములను ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు స్వామివారి పట్టాభిషేక మహోత్సవ ఘటాన్ని భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. రాత్రి సీతారాములు గరుడ వాహనంపై నాలుగుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించిన భక్తులు పరవశించిపోయారు. కార్యక్రమంలో ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు (ఫైల్)

మదనపల్లె సిటీ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసి వారికి ఉపకార వేతనాలు అందిస్తోంది నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకం (ఎన్‌ఎంఎంఎస్). కేంద్ర మానవ వనరుల శాఖ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పొందేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించి అర్హత పొందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తుంది. ఈ పథకానికి దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు అందించే స్కాలర్‌షిప్ పథకానికి ఏటా ఆదరణ పెరుగుతోంది.



2009–09 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం

పేద విద్యార్థుల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు 2008–09లో ఎన్‌ఎంఎంఎస్ పథకాన్ని ప్రవేశపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పరీక్షల సంచాలకుల ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌కు అర్హత పొందేందుకు ప్రవేశ పరీక్షను నవంబర్‌లో నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.ఆరు వేల స్కాలర్‌షిప్‌ను వారి అకౌంట్లలో వేస్తారు. జిల్లాలో ఈ పరీక్షలకు అధికంగా విద్యార్థులు హాజరవుతున్నారు. మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అత్యధికంగా విద్యార్థులు ప్రతి ఏటా ఎంపికవుతున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నారు.

పరీక్ష విధానమిలా...

- ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్షకు అర్హులు.
- 7వ తరగతి మార్కుల ఆధారంగా పరీక్షకు అర్హత కల్పిస్తారు.
- ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు ఏడవతరగతిలో 50 శాతం,మిగిలిన తరగతుల వారు 55 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. బీసీ, ఓసీ విద్యార్థులు పరీక్ష ఫీజుగా రూ.100 ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉంది.
- ఆబ్జెక్టివ్ విధానంలో 150 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది.
- జిల్లా ప్రాతిపదికగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.3.5 లక్షలకు మించి ఉండకూడదు.
- డివిజన్ కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ఈ నెల ఐదో తేదీన నోటిఫికేషన్ జారీ కాగా, రాత పరీక్ష డిసెంబర్8న నిర్వహించనున్నారు.
- సెప్టెంబర్ 6 ఆన్‌లైన్ దరఖాస్తుకు తుది గడువు. కాగా పరీక్ష ఫీజు చెల్లింపునకు సెప్టెంబర్ 10 చివరి తేదీ. పరీక్ష రుసుము ఆన్‌లైన్ దరఖాస్తులో ఇవ్వబడిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలి. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో లేదా సంబంధిత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఏటా అధిక సంఖ్యలో విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లకు అర్హత పొందుతున్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా హెచ్‌ఎంలు ప్రోత్సహించాలి.

–శివప్రకాష్‌రెడ్డి, డిఈఓ

ఉపాధ్యాయుల శిక్షణతోనే జిల్లా ఫస్ట్ వచ్చాను



గత ఏడాది జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాల్లో 131 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్ వచ్చాను. పాఠశాల ఉపాధ్యాయులు ఇచ్చిన శిక్షణ బాగుంది. ప్రత్యేకంగా సమయం కేటాయించడం వల్ల మంచి మార్కులు వచ్చాయి. బాగా చదివి ఉపాధ్యాయురాలు కావడమే లక్ష్యం.

–సాయి సాహితీ, వివేకానంద మున్సిపల్ పాఠశాల.మదనపల్లె

109 రకాల నూతన వంగడాలు విడుదల

కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎ.వీరయ్య



మాట్లాడుతున్న కృషివిజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. ఎ. వీరయ్య

వైవీయూ: వాతావరణ మార్పులను తట్టుకుని, పోషకాలు జోడించిన, అత్యధిక దిగుబడులు ఇచ్చే 109 రకాల నూతన వంగడాలను భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ విడుదల చేశారని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయకర్త డాక్టర్ ఎ. వీరయ్య పేర్కొన్నారు. ఆదివారం కృషి విజ్ఞానకేంద్రంలో నూతన వంగడాల విడుదల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 క్షేత్రపంటలు, 27 ఉద్యానపంటలు మొత్తంగా 61 పంటలలో 109 రకాలను అందుబాటులోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. పసుపు పంటలో కలుపు నివారణకు పిచికారి చేసే మందుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సామాజిక విజ్ఞాన శాస్త్రవేత్త డా. ప్రశాంతి, సస్యరక్షణ శాస్త్రవేత్త డా.వి.శిల్పకళ మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్యానశాస్త్రవేత్త డా. ఎస్. మనాస, డా. టి. మహేష్ బాబు, డా. ఐ. సురేష్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ మృతి

– సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పట్టణ సీఐ నరేష్‌బాబు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో దేవరింటి ఎరుకలమ్మ(60) అనే మహిళ ఆదివారం మృతి చెందారు. పట్టణ సీఐ నరేష్‌బాబు వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామానికి చెందిన దేవరింటి ఎరుకలమ్మ మృత దేహం కడప రోడ్డులోని దాబా పక్కన పొలంలో గుర్తించినట్లు తెలిపారు. మృతురాలి శరీరంపై ఆభరణాలు, బ్యాగులోని పర్సులో డబ్బులు ఉన్నాయని వివరించారు. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఎరుకలమ్మ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పులివెందుల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో మిసింగ్ కేసు నమోదైనట్లు తెలిసింది.

వర్షానికి కూలిన గోడ



రామసముద్రం : రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లెకి చెందిన రైతు కె.శివశంకర్‌రెడ్డి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆదివారం గాలులతో కూడిన వర్షాలకు శివశంకర్‌రెడ్డి ఇంటి గోడ కూలిపోయింది. సుమారు రూ.60 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె : జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. కొండయ్యగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలో ఆదివారం జూదం ఆడుతుండగా దాడులు చేసి నిమ్మనపల్లె, చౌకిళ్లవారిపల్లెకు చెందిన ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.6,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


మృతిచెందిన గంగులయ్య

చిన్నమండెం : మండలంలోని కడప–బెంగళూరు జాతీయ రహదారిపై దేవగుడిపల్లె వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గంగులయ్య(52) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. లక్కిరెడ్డిపల్లి నుంచి గంగులయ్య, వారి బంధువులతో కలిసి పడమటికోన పరిధిలోని హరిజనవాడలో వివాహ లగ్నపత్రిక రాసుకునేందుకు వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఆటోలో చిన్న మండెం నుంచి వస్తుండగా..టమోటా లోడ్‌తో వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో గంగులయ్య మృతిచెందగా, ఏడుగురు తీవ్రంగా గాయపడడంతో రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రులంతా రెడ్డివారిపల్లి గ్రామం హరిజనవాడకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. చిన్నమండెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రాగా ముగిసిన మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం డ్రాగా ముగిశాయి. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 335 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు చివరిరోజున 176.2 ఓవర్లలో 573 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులో వరుణ్ సాత్విక్ 214, నిశ్చయ్ 65 పరుగులు చేశారు. కడప బౌలర్లు ధీరజ్‌కుమార్ 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 21 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 259 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. కృష్ణా జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 381 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు 158.2 ఓవర్లలో 697 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పరమ్‌వీర్ సింగ్ 208 పరుగులు, కేఏఎస్.ప్రసాద్ 112 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు భార్గవ్ మహేష్ 7 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 11 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 31 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 331 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.


వరుణ్‌సాత్విక్ (214 పరుగులు)


పరమ్‌వీర్ సింగ్ (208 పరుగులు)


కేఏఎస్ ప్రసాద్ (112పరుగులు)


భార్గవ్ మహేష్ (7 వికెట్లు)

శ్రీకాకుళం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 66 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు 72 ఓవర్లలో 238 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని హర్షవర్ధన్ 55, రక్షణ్ 48 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు పూర్ణ 5 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 42 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. జట్టులోని థామస్ రామ్‌కుమార్ 59 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్లు రేవంత్ నాగకుమార్ 3 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో పశ్చిమగోదావరి జట్టు 231 పరుగులు చేయగా, శ్రీకాకుళం జట్టు 243 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో శ్రీకాకుళం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

యువకుడు ఆత్మహత్య


అమర్ తేజ (ఫైల్)

వాల్మీకిపురం : అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వాల్మీకిపురంలో చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లి సమీపంలోని అమ్మినేనివీధికి చెందిన వెంకటరాజు కుమారుడు అమర్‌తేజ (29)కొంత కాలంగా శక్తికి మించి అప్పుచేశారు. అప్పుల ఒత్తిడికి తట్టుకోలేక మానసిక ఒత్తిడికి గురైన అతడు తీవ్ర మనస్తాపం చెందారు. శనివారం రాత్రి మదనపల్లి నుంచి వాల్మీకిపురం పట్టణ పొలిమేర్లకు చేరుకున్న అమర్‌తేజ ఆదివారం తిరుపతి నుంచి గుంతకల్‌కు వెళ్లే రైలు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో యువకుడి శరీరం గుర్తుపట్టలేని విధంగా ముక్కలుగా పడిపోయింది. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించగా.. వారు చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోలీ గుడ్లు సరఫరా

పోషకాహారం పేరుతో గోలీ గుడ్లు సరఫరా చేసి చేతులు దులుపు కొంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు వాటిని చూసి ఇవేం గుడ్లు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

• అంగన్‌వాడీలకు తక్కువ పరిమాణంతో సరఫరా • చోద్యం చూస్తున్న ఐసీడీఎస్ అధికారులు


గోళీ ఆకారంలో కనిపిస్తున్న గుడ్లు

పెద్దతిప్పసముద్రం : బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కేంద్రం పరిధిలోని పెద్దతిప్పసముద్రం మండలంలో 74, బి.కొత్తకోటలో 72, ములకలచెరువు మండలంలో 75 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మొత్తం ఈ 221 కేంద్రాలకు కోడిగుడ్ల పంపిణీ కాంట్రాక్టర్లకు కాసులు కురిపిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు, గర్భిణులు, బాలింతలు, శిశువులకు సూచించిన పరిణామంలో కాకుండా గోళీ సైజు గుడ్లు సరఫరా చేస్తున్నారు. టెండర్ దక్కించుకున్న గుత్తేదారు తక్కువ పరిణామంలో గుడ్లను సరఫరా చేయడం ఎంత వరకు సమంజసమని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు నిభంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై ప్రశ్నిస్తే ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని.. కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు మిన్నకుండిపోతున్నారు.

మా దృష్టికి రాలేదు

అంగన్‌వాడీలకు సరఫరా చేసే కోడిగుడ్లు తక్కువ సైజులో వున్నాయనే విషయం మా దృష్టికి రాలేదు. కార్యకర్తలెవరూ ఈ విషయంపై ఫిర్యాదు చేయలేదు. తక్కువ పరిణామం ఉన్నా.. కుళ్లినా,వెనక్కు పంపాలని కార్యకర్తలకు సూచించాం. నిభంధనల ప్రకారం గుడ్లు సరఫరా అయ్యేలా చూస్తామన్నాం చర్యలు చేపడతాం. – భాగ్యమ్మ, సీడీపీఓ

రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సిలింగ్


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ డి.కొండయ్యనాయుడు

మదనపల్లె : పట్టణంలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని 36 మంది రౌడీషీటర్లకు డీఎస్పీ కొండయ్యనాయుడు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. డీఎస్పీ కార్యాలయంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రౌడీ షీటర్లుగా నమోదైన వారందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి నేరాలకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా నగర బహిష్కరణ చేస్తామన్నారు. రాత్రి పది గంటల తర్వాత పట్టణంలో తిరగవద్దని హెచ్చరించారు. పాత కేసుల్లో విచారణ పూర్తయ్యేంత వరకు ఎలాంటి నేరాలకు పాల్పడినా కేసులు రీ ఓపెన్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపేటలో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ మోహన్‌కుమార్, ఎస్‌ఐ మధుసూదన్‌రావు

సిద్ధవటం : మండలంలోని బంగారుపేట గ్రామంలోని రెండిళ్లలో ఆదివారం చోరీ జరిగింది. బంగారుపేటకు చెందిన గూండ్ల రామక్రిష్ణ, ఆయన సోదరుడు గూండ్ల వసంతరావు కుటుంబీకులు ఈ నెల 6న ఇళ్లకు తాళాలు వేసి బళ్లారికి వెళ్లారు. ఆదివారం వసంతరావు కుమారుడు శివసాయికుమార్ వచ్చి చూడగా.. ఇంట్లో దుస్తులు చెల్లా చెదురుగా కనిపించాయి. దీంతో తన ఇంట్లో రూ.40 వేల నగదు, జత కమ్మలు, ఉంగరం, రామక్రిష్ణ ఇంట్లో రూ.10వేల నగదు, రెండు జతల కమ్మలు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంటిమిట్ట సీఐ మోహన్ కుమార్, ఎస్‌ఐ మధుసూదన్‌రావు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

కొవ్వొత్తులతో నిరసన


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : శిలా పలకాలు ధ్వంసం చేసే సంస్కృతి విడనాడాలని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజంసుకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడలోని సామజిక న్యాయ మహాశిల్పంపై టీడీపీ నాయకుల దాడిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడమంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయులు రత్నమ్మ, మార్రెళ్ల రాజేశ్వరి, సాయి కిశోర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సీహెచ్.రమేష్, మండల నాగేంద్ర, రుద్దిరాల రమణ, డమ్ము రఘు, రవి, డీవీ.రమణ, చంద్రశేఖర్, రత్తయ్య, లక్ష్మీనారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురవాలని పూజలు

రాయచోటి టౌన్ : వర్షం కురవాలని ఆకాంక్షిస్తూ.. ఆదివారం రాత్రి వీరబల్లె మండలం ఓదివీడు గ్రామం బెస్తపల్లెలో కడవ పూజలు (సాంగెం) నిర్వహించారు. ఉదయం నుంచి ఒకే పేరుతో ఉన్న ముగ్గురు వ్యక్తులు(రమణయ్యలు) ఉపవాస దీక్షలతో రామాలయం వద్దకు చేరుకొని రాముల వారికి పూజలు జరిపారు. గ్రామ రెడ్డిని వేదికపై కూర్చోబెట్టి 12 సేర్ల రాగులు రాశిగాపోసి.. కుండతో నీళ్లు పోశారు. అనంతరం కుండను భక్తి శ్రద్ధలతో రెండు చేతులతో పట్టుకుని పడమర దిక్కున నీళ్లను పోసింది. నాలుగో పాదంలో వర్షాలు కురుస్తాయని పెద్దలు తెలిపారు. ఇది చూసేందుకు భక్తులు తరలివచ్చారు.


నిండు కుండ పట్టుకొని తిరుగుతున్న భక్తులు

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య


మృతి చెందిన వెంకటసుబ్బమ్మ

సిద్ధవటం : మండలంలోని పాలకొండ్రాయునిపల్లె గ్రామానికి చెందిన ఎందుల కొండు వెంకటసుబ్బమ్మ(42) ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఎద్దుల కొండు వెంకటసుబ్బమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యా, భర్తలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చాలాకాలంగా వెంకటసుబ్బమ్మ కడుపునొప్పితో బాధపడుతోంది. మాత్రలు మింగిన తగ్గకపోవడంతో మనస్తాపం చెందింది. ఆదివారం భర్త పొలం పనులకు వెళ్లగా.. వెంకటసుబ్బమ్మకు ఇంట్లో కొక్కికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం కొరకు కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

సర్దుబాటుకు ముందే పదోన్నతులు చేపట్టాలి

ఎన్‌టీపీ రాష్ట్ర బాధ్యుడు కె.శ్రీనివాసరాజు


సమావేశంలో మాట్లాడుతున్న కొండూరు శ్రీనివాసరాజు

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు ముందే పదోన్నతులు చేపట్టాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీపీ) రాష్ట్ర బాధ్యుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. రాయచోటి డైట్ కేంద్రంలో జరిగిన సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్‌గా, స్కూల్ అసిస్టెంట్లను ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించాలని కోరారు. ప్లస్ టూ పాఠశాలలో తాత్కాలిక నియమకాల ద్వారా కాకుండా శాశ్వత ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్ పదోన్నతులు చేపట్టాలన్నారు. మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సరీస్‌ను 62 సంవత్సరాలకు పెంచాలని, కస్తూర్బా గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నైట్ డ్యూటీ నుంచి తొలగించి మహిళా వార్డెన్లను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజులు, శ్రీనివాసులు, మురళీ మోహన్‌రాజు, కులశేఖర్ రెడ్డి, నరేంద్రకుమార్‌రెడ్డి, అఫీజ్, నాగరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

బి.కొత్తకోట : మైనర్ బాలికపై దాడి చేసి కొట్టారనే ఆరోపణలపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట బీసీ కాలనీ చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని కుటుంబంతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 7న ఇదే కాలనీకి చెందిన కొందరు బీరంగిరోడ్ ప్రాంతంలో వెళ్తున్నారు. ఆ సమయంలో అమ్మమ్మ ఇంటికి వెళ్తున్న 8వ తరగతి విద్యార్థిని ఆగి వారితో మాట్లాడుతోంది. ఇది చూసిన కొందరు యువకులు ఇక్కడ ఏం చేస్తున్నారంటూ మందలిస్తూ.. విద్యార్థిని, మరో యువకుడిపై దాడి చేసి గాయపరిచారు. తన కుమార్తెకు గాయాలవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉంటే కేసుతో సంబంధంలేని తమ పిల్లలను అనవసరంగా ఇరికించారంటూ స్టేషన్ ఎదుట నలుగురి పిల్లల బంధువులు నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

కత్తితో యువకుడిపై దాడి


కడుపులో కత్తితో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నవాజ్

కలకడ : ప్రత్యర్థులు కత్తితో దాడిచేయగా.. గాయాలతో క్షతగాత్రుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సంఘటన ఆదివారం రాత్రి కలకడలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కలకడ రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన నవాజ్ తన భార్యతో మాటా మాటా పెరిగి ఘర్షణపడ్డారు. కడప నుంచి వచ్చిన వారి బంధువులు మందలించే సమయంలో షాను తన వద్ద ఉన్న కత్తితో నవాజ్ కడుపులో పొడిచినట్లు తెలిపారు. ఆందోళన చెందిన నవాజ్ కడుపులో కత్తిని తీయలేక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. స్పందించిన ఎస్‌ఐ, పోలీసులు వెంటనే తిరుపతి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత అవసరం

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఆదివారం సంఘం జిల్లా కార్యవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటా అందించేందుకు గత ప్రభుత్వం వలంటరీ వ్యవస్థ ఏర్పాటు చేసిందన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాల్సి ఉందన్నారు. బకాయి పడిన రెండు నెలల గౌరవ వేతనం చెల్లించాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లలో రాజీనామా చేసిన వలంటీర్లందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఆగస్టు 10వ తేదీ నుంచి 15వ తేదీవరకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులకు మెయిల్స్, పోస్టుకార్డు ద్వారా విన్నవించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దార్ల రాజశేఖర్, పెంచలయ్య, వినయ్, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన చిన్నక్క, అమీర్‌బాషా


మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తంబళ్లపల్లె మండలం రెడ్డికోట గ్రామానికి చెందిన డి.చిన్నక్క(65) భర్త దశదిన కర్మల్లో భాగంగా ఆటోలో తలారివాండ్లపల్లెకు వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గ మధ్యంలో మరో వాహనం ఆటోను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా మదనపల్లె పట్టణంలోని డీఎస్పీ బంగ్లా సమీపంలో నివాసం ఉన్న ఆటో డ్రైవర్ ఎస్.అమీర్ బాషా(43) స్థానికంగా కొందరితో కలిసి ఆటోలో గండి ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పెద్దమండ్యం సమీపంలోని చెరువు కట్టపై ఎదురుగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అమీర్‌బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనాల ద్వారా మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తెను చూసేందుకు వెళ్తూ ప్రమాదంలో మృతి


మృతి చెందిన నరసింహులు

పెనగలూరు : మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన రాచూరి నరసింహులు(37) తన కుమార్తెను చూసేందుకు వెళ్తుండగా ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. నరసింహులు ఖతార్ దేశానికి వెళ్లి అక్కడ పనిచేసుకుంటూ వారం క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. మృతుడి భార్య గల్ఫ్ దేశంలోనే ఉంటుంది. నరసింహులు ఉదయాన్నే అందరితో ఆప్యాయంగ మాట్లాడారు. అనంతరం నెలూరు జిల్లా పెనబద్వేల్ గ్రామంలో అవ్వగారి ఇంటివద్ద ఉన్న కుమార్తెను చూసేందుకు చిన్న కుమారుడు రిషీతో కలిసి నరసింహులు బయలుదేరారు. ఓబులాయపల్లె వద్ద ఎదురుగా వస్తున్న మరో స్కూటర్ ఢీకొంది. నరసింహులు అక్కడికక్కడే మృతి చెందగా చిన్న కుమారుడు రిషీకి గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడికి చేరుకున్న బంధువులు, కుటుంబీకులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

జనసేనలో లుకలుకలు


మాట్లాడుతున్న జనసేన నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు జనసేన పార్టీలో విబేధాలు ఆదివారం బయటపడ్డాయి. స్థానిక సిద్దేశ్వర కల్యాణ మండపంలో నియోజకవర్గ జనసేన ఆత్మీయ సమ్మేళనం జగిగింది. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హాజరు అవ్వుతారని ముందుగా ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడుకు జనసేన కార్యకర్తలు, నాయకుల్లో పట్టు ఉంది. అయితే ఎమ్మెల్యే శ్రీధర్ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి అనుచరుడు కావడంతో సమ్మేళనానికి హాజరు కాలేదు. మాజీ ఎమ్మెల్సీ అనుచరులు మాత్రమే సమావేశానికి హాజరు అయినట్లు సమాచారం. దీంతో ఇరు వర్గాల మధ్య లుకలుకలు ఉన్నాయనే చర్చ జోరందుకుంది.

ఇసుక లారీలు, హిటాచీ పట్టివేత

పెండ్లిమర్రి : మండలంలోని తువ్వపల్లె–అల్లిరెడ్డిపల్లె గ్రామాల మధ్య పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా.. మూడు ఇసుక లారీలు, హిటాచి మిషన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి పెండ్లిమర్రి స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

• కమనీయం.. లక్ష్మీనరసింహుని కల్యాణం



మండలంలోని తరిగొండలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులకు అభిషేకం, అర్చన క్షీరాభిషేకం చేశారు. ముత్యాల తలంబ్రాలతో కల్యాణం ఘనంగా జరిపారు. వేద పండితులు మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా మాంగల్యధారణ గావించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, ప్రసాదాలు అందజేశారు. – గుర్రంకొండ

• వైభవంగా ముత్తుమారమ్మ జాతర


అంబళ్లను తీసుకువస్తున్న మహిళలు

మండలంలోని అరవపల్లి గ్రామంలో వెలసిన ముత్తుమారమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఊరికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో పోతులరాజు సోదరి అన్నపూర్ణమ్మను జాతరకు తీసుకువచ్చి ప్రత్యేకంగా నిర్మించిన మందిరంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దీంతో జాతర తంతు మొదలైంది. మహిళలు అంబళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భోగాపతి వెంకట రమణ ప్రసాదాన్ని అందజేశారు. సాయంత్రం మ్యాజిక్ షో ఆకట్టుకుంది. – నందలూరు